క్లుప్తంగా

రేపు అక్కినేని ప్రతిభా పురస్కారాల ప్రదానం

పాత గుంటూరు: బందావన్ గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయం అన్నమయ్య కళావేదికపై డిసెంబర్ 1న అక్కినేని నాగేశ్వరరావు శత జయంతి పురస్కరించుకొని వివిధ రంగాలలోని విశిష్ట వ్యక్తులకు ప్రతిభా పురస్కారాల్ని ప్రదానం చేయనున్నట్లు యువ కళావాహిని అధ్యక్షుడు లంక లక్ష్మీనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. సాంస్కృతిక బంధు సారిపల్లి కొండలరావు ఆధ్వర్యంలో సినీ నటులు అశోక్ కుమార్, దర్శకులు సీహెచ్. రజిత మూర్తి, వీణా విద్వాంసురాలు ఏ. భారతీదేవి, టీవీ నటులు విడుదల సాంబశివరావు, డాక్టర్ ఎ.ఎస్.ఆర్. పి. సూరిబాబు, కవి బనాల మల్లేశ్వరరావు, ఎస్.వి.రామారావుకు పురస్కారాలు ప్రదానం చేయనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో కళాభిమానులు పాల్గొనాలని ఆయన కోరారు.

ఉత్సాహంగా రంగోలి పోటీలు



గుంటూరు మెడికల్: వరల్డ్ ఎయిడ్స్ డేను పురస్కరించుకుని బుధవారం గుంటూరు డీఎంహెచ్‌వో కార్యాలయంలో రంగోలి పోటీలు నిర్వహించారు. పలు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు ఉత్సాహంగా పోటీల్లో పాల్గొని, అందమైన ముగ్గులతో అలరించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో డాక్టర్ అమర్తలూరి శ్రావణ్ బాబు మాట్లాడుతూ హెచ్ఐవీపై ప్రజలకు అవగాహన పెరగడం ద్వారా పాజిటివ్ కేసులు బాగా తగ్గుముఖం పట్టాయని తెలిపారు. ఇప్పటికీ మారుమూల గ్రామాల్లో హెచ్ఐవీ బాధితులు వివక్షతకు గురవుతున్నారని, దీన్ని రూపుమాపాల్సిన బాధ్యత అందరిపై ఉందని చెప్పారు. కార్యక్రమంలో ఎన్‌హెచ్ఎంవో డీపీఎంవో డాక్టర్ చుక్కా రత్నమన్మోహన్, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ అధికారి డాక్టర్ శ్రీనివాసులు, ఐసీటీసీ జిల్లా సూపర్‌వైజర్ జ్యోతుల వీరాస్వామి పాల్గొన్నారు.

3న పద్మశాలీ సంఘీయుల కార్తిక వన సమారాధన

నెహ్రూనగర్: పద్మశాలీ సంఘీయుల కార్తిక వన సమారాధన డిసెంబర్ 3న నారాకోడూరులో నిర్వహించనున్నట్లు పద్మశాలీయ సంక్షేమ సంఘం అధ్యక్షుడు చిన వీరయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర, జిల్లాస్థాయి సంఘ ప్రముఖుల సందేశాలతో పాటు, సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని ఆయన పేర్కొన్నారు.

ఫార్మసీ సూపర్‌వైజర్‌గా కృష్ణకుమారికి పదోన్నతి



గుంటూరు మెడికల్: జీజీహెచ్ ఫార్మసీ విభాగంలో గ్రేడ్-1 ఫార్మసిస్టుగా విధులు నిర్వహిస్తున్న ఎం.కృష్ణకుమారికి సూపర్‌వైజర్‌గా పదోన్నతి లభించింది. ఆమెను గుంటూరు నుంచి ఒంగోలు డీఎంహెచ్‌వో కార్యాలయానికి బదిలీ చేశారు. గుంటూరు ప్రాంతీయ వైద్య ఆరోగ్య శాఖ సంచాలకులు (ఆర్డీ) డాక్టర్ శోభారాణి బుధవారం కౌన్సెలింగ్ నిర్వహించి, ఆమెకు పదోన్నతి ఉత్తర్వులు అందజేశారు. గుంటూరు వైద్య కళాశాలలో గ్రేడ్-1 ఫార్మాసిస్టుగా పనిచేస్తున్న పి.నాగేశ్వరరావుకు ప్రమోషన్ ఇచ్చి మార్కాపురం ప్రభుత్వ ఆసుపత్రి సూపర్‌వైజర్‌గా బదిలీ చేశారు. నెల్లూరు జీజీహెచ్‌లో పనిచేస్తున్న ఎల్.వెంకటేశ్వర్లుకు ఫార్మసీ సూపర్‌వైజర్‌గా ప్రమోషన్ ఇచ్చి ఒంగోలు జీజీహెచ్‌కు బదిలీ చేశారు. కౌన్సెలింగ్ ప్రక్రియలో ఆర్డీతోపాటుగా సూపరింటెండెంట్ సుధీర్, సీనియర్ అసిస్టెంట్ బి.అనిల్ శ్యామ్ బాబు పాల్గొన్నారు.

మహిళ మెడలో గొలుసు చోరీ

గుంటూరు ఈస్ట్: మహిళ మెడలో బంగారు గొలుసు తెంచుకుని ఆగంతకుడు పరారైన సంఘటనపై పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. కృష్ణనగర్‌కు చెందిన అద్దేపల్లి భవాని బుధవారం రైతుబజారుకు వెళ్లారు. కూరగాయలు కొనుగోలు చేసి ఇంటికి వెళ్లే క్రమంలో ద్విచక్ర వాహనం వద్దకు వచ్చారు. ఈ సమయంలో ఓ ఆగంతకుడు భవానీ సమీపానికి వచ్చి ఆమె మెడలోని నాలుగు సవర్ల బంగారు గొలుసు తెంచుకుని పరారయ్యాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

3న బీహెచ్ హైస్కూలు పూర్వ విద్యార్థినుల సమావేశం

గుంటూరు ఎడ్యుకేషన్: బ్రాడీపేట రెండో లైనులోని బండ్లమూడి హనుమాయమ్మ (బీహెచ్) బాలికోన్నత పాఠశాల పూర్వ విద్యార్థినుల సమావేశాన్ని డిసెంబర్ 3న పాఠశాల ప్రాంగణంలో నిర్వహిస్తున్నట్లు సంఘ చైర్‌పర్సన్ జయశ్రీ, కన్వీనర్ గోవిందరాజుల సంధ్యశ్రీ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పాఠశాలలో 1953 నుంచి ఇప్పటి వరకు చదివి దేశ, విదేశాల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థినులు హాజరుకానున్నట్లు తెలిపారు. సమావేశానికి రవాణా శాఖ సంయుక్త కమిషనర్ కృష్ణవేణి ముఖ్య అతిథిగా పాల్గొననుండగా, పూర్వ ఉపాధ్యాయుల్ని సత్కరించనున్నట్లు తెలియజేశారు. పూర్వ విద్యార్థినులంతా సమావేశానికి హాజరుకావాలని వారు కోరారు.

అయ్యో.. అగస్త్యేశ్వర!

- ఆలయంలో చోరీల బెడద
- భయాందోళనలో భక్తులు
- కనీసం పట్టించుకోని పాత గుంటూరు పోలీసులు
- చెప్పుకుందామంటే కనబడని కార్యనిర్వహణాధికారి



పాత గుంటూరు అగస్త్యేశ్వరస్వామి ఆలయం

పట్నంబజారు: నగరంలోని పాత గుంటూరులో వేంచేసియున్న శ్రీ గంగాపార్వతీ సమేత అగస్త్యేశ్వర స్వామి ఆలయానికి శతాబ్దాల చరిత్ర ఉంది. ఇక్కడ అగస్త్యేశ్వర మహా ముని శివలింగాన్ని ప్రతిష్ఠించారని చరిత్ర చెబుతోంది. నిత్యం ఎంతో మంది భక్తులు స్వామి దర్శనం కోసం వస్తుంటారు. ఇక కార్తిక మాసం అంటే చెప్పాల్సిన పనిలేదు. ఇంతటి ప్రాశస్త్యం ఉన్న అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో ఇటీవల దొంగల బెడద అధికమైపోయింది.

వరుస చోరీలతో కలకలం

- కొంత కాలం కిందట దొంగలు ఆలయం ఎదుట చెప్పుల స్టాండ్ వ్యక్తి నుంచి సెల్‌ఫోన్, నగదు దోచుకుపోయారు.
- ఇటీవల ఇద్దరి సెల్‌ఫోన్లు, ఒక మహిళ హ్యాండ్ బ్యాగ్ అపహరించుకుపోయారు.
- ఓ కళాశాల విద్యార్థి ఫీజును బ్యాగులో పెట్టుకుని ఆలయానికి వచ్చి ప్రదక్షిణలు చేస్తున్న సమయంలో నగదును ఎత్తుకు పోయారు.

స్పందనేది ?

విద్యార్థి తాను పోగొట్టుకున్న నగదుపై ఆలయ ఈవోకు ఫిర్యాదు చేశారు. అయినప్పటికీ కనీసం స్పందించ లేదు. ఎప్పుడు ఆలయానికి వచ్చినా ఈవో అందుబాటులో ఉండటం లేదని భక్తులు చెబుతున్నారు. ఆలయంలో సీసీ కెమెరాలు కూడా అంతంతమాత్రంగానే పని చేస్తున్నాయని ఆరోపిస్తున్నారు. చోరీలు జరిగిన తరువాత వాటిని కొద్ది రోజుల కిందట బాగు చేయించినా... మళ్లీ పని చేయడం లేదని తెలుస్తోంది. దొంగతనాలు పునరావృతం అవుతున్నా ఆలయ కార్యనిర్వహణాధికారి, సిబ్బంది ఏ మాత్రం పట్టించుకోకపోవడంపై భక్తులు బాహాటంగానే విమర్శలకు దిగుతున్నారు. ఆలయంలో పరిస్థితుల గురించి ఈవో తన దృష్టికి రాలేదని చెప్పడం కొసమెరుపు.

సిబ్బంది ఉన్నా.. లేనట్లే !

కార్యనిర్వహణాధికారి అప్పుడప్పుడు మాత్రమే ఆలయానికి వచ్చి వెళుతున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. సిబ్బంది తీరు కూడా అలాగే ఉంటోందని భక్తులు వాపోతున్నారు. అంతా కుర్చీలు వేసుకుని కూర్చుని మరి కబుర్లు చెప్పుకోవడం తప్పా చేసేదేమి లేదని విమర్శిస్తున్నారు. ఆలయంలో ఇంత తంతు జరుగుతున్నా.. పట్టించుకునే నాథుడే లేకుండా పోయాడు. రాత్రి వాచ్‌మన్ కూడా తూతూ మంత్రంగా విధులు నిర్వర్తిస్తున్నాడని తెలిసింది. గత ప్రభుత్వ వాచ్‌మన్ మృతి చెందిన నేపథ్యంలో ప్రైవేట్‌గా ఒక వ్యక్తిని పెట్టినప్పటీకీ ఎటువంటి ప్రతిఫలం కనపడటంలేదు. దీంతో భక్తులు వారి బాధలు ఎవరికి చెప్పుకోవాలో అర్థం కాని పరిస్థితి నెలకొంది. ఇన్ని చోరీలు జరుగుతున్నప్పటికీ సిబ్బంది కనీసం కనీసం పోలీసులకు ఫిర్యాదు చేయకపోవడం గమనార్హం. ఇప్పటికైనా దేవదాయశాఖ ఉన్నతాధికారులు పట్టించుకుని, చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుకుంటున్నారు.

విచారించి చర్యలు తీసుకుంటాం

ఆలయంలో చోరీలపై పూర్తి స్థాయిలో విచారించి చర్యలు తీసుకుంటాం. దీంతో పాటు విషయాన్ని ఉన్నతాధికారులకు తెలియజేస్తాం. భక్తులకు అసౌకర్యం కలుగకుండా చర్యలు తీసుకుంటాం.

– బి. మహేశ్వరరెడ్డి (ఏసీ, దేవదాయశాఖ)

సీసీ ఫుటేజీలు పరిశీలిస్తున్నాం

ఆలయంలో సంఘటనలు పూర్తిగా నా దృష్టికి రాలేదు. విద్యార్థికి చెందిన రూ . 1500 పోయాయన్న అంశం మాత్రమే తెలిసింది. దీనిపై దృష్టి సారించి, సీసీ ఫుటేజీ పరిశీలిస్తాం. ఇప్పటికే అనుమానిత వ్యక్తుల్ని ఆలయంలోకి రానివ్వడం లేదు. ఇటువంటి ఘటనలు జరగకుండా చూసుకుంటాం.

– ఎస్. సౌమ్య, ఆలయ ఈవో

పోలీసుల దృష్టికి రాలేదు

అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో చోరీలకు సంబంధించి ఇప్పటి వరకు ఆలయ అధికారులు, సిబ్బంది ఫిర్యాదు చేయలేదు. చేస్తే తక్షణమే చర్యలు తీసుకుంటాం. చోరీలు జరిగినప్పుడు అధికారులు, భక్తులు మా దృష్టికీ తీసుకుని రావడం ద్వారా ఇకపై జరగకుండా నియంత్రించగలం. ఆలయంలో చోరిపై ప్రత్యేక దృష్టి సారిస్తాం.

–ఎం.వి. సుబ్బారావు (సీఐ, పాతగుంటూరు)

అనధికార వెంచర్లు తొలగిస్తాం

కమిషనర్ కీర్తి చేకూరి



అనధికార లే అవుట్స్‌లో హద్దురాళ్లను తొలగిస్తున్న మున్సిపల్ సిబ్బంది

గుంటూరు రూరల్: నగర శివారుల్లో నగరపాలక సంస్థ నుంచి అనుమతులు తీసుకోకుండా ఏర్పాటు చేసే వెంచర్లు లేదా లే అవుట్స్‌ని తొలగిస్తామని, ప్రజలు కూడా అనుమతి పొందిన వెంచర్లలోనే స్థలాలు కొనుగోలు చేయడం ద్వారా భవిష్యత్‌లో సమస్యలు రాకుండా ఉంటాయని నగర కమిషనర్ కీర్తి చేకూరి తెలిపారు. కమిషనర్ ఆదేశాల మేరకు బుధవారం నగర పరిధిలోని ఏటుకూరు, లాలుపురం డొంక రోడ్డు, నల్లపాడు ప్రాంతాల్లో అనుమతి లేకుండా ఏర్పాటు చేసిన ప్రైవేట్ వెంచర్ల హద్దు రాళ్ల, మార్కింగ్, రోడ్లను డీసీపీ కోటయ్య ఆధ్వర్యంలో పట్టణ ప్రణాళికాధికారులు తొలగించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో ఎక్కడా అనధికార లే అవుట్ ఉండడానికి వీల్లేదని స్పష్టం చేశారు. ప్రభుత్వ నిర్దేశిత చెక్ లిస్ట్ మేరకు దరఖాస్తు చేసే లే అవుట్స్‌కి వేగంగా అనుమతులు మంజూరు చేస్తామని తెలిపారు. ప్రజలు కూడా వెంచర్లలో స్థలాలు కొనుగోలు చేసే ముందు అనుమతుల్ని పరిశీలించుకోవాలని, లేనిపక్షంలో రానున్న కాలంలో సమస్యలు వస్తాయని సూచించారు. అనధికార లే అవుట్స్‌ని తొలగించడానికి సచివాలయాల వారీగా పట్టణ ప్రణాళికాధికారులు యాక్షన్ ప్లాన్ సిద్ధం చేశారని ఆమె చెప్పారు. అనధికార లే అవుట్స్ తొలగించడంతో పాటు నిర్వాహకులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. వెంచర్ల నిర్వాహకులు కూడా జీఎంసీ నుంచి అనుమతుల మంజూరు సులభతరం చేసినందున, అనధికార లే అవుట్స్ ఏర్పాటు చేసి సమస్యలకు గురికావద్దని ఆమె సూచించారు. పట్టణ ప్రణాళిక అధికారులు తొలగించిన వెంచర్ల యజమానులకు వెంటనే అనుమతుల కోసం దరఖాస్తు చేసుకోవాలని తెలిపామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏసీపీలు అజయ్‌కుమార్, మురళి, టీపీఎస్‌లు సువర్ణకుమార్, లక్ష్మణస్వామి, రిజ్వానా, సచివాలయ ప్లానింగ్ కార్యదర్శులు పాల్గొన్నారు.

కర్రసాములో నగర విద్యార్థినికి బంగారు పతకం



విద్యార్థినులను అభినందిస్తున్న విష్ణువర్ధన్, వరప్రసాదరావు

గుంటూరు ఎడ్యుకేషన్: నేషనల్ ట్రెడిషనల్ సిలంబం చాంపియన్‌షిప్ ఆధ్వర్యంలో నిర్వహించిన కర్రసాము పోటీల్లో శ్రీ పాటిబండ్ల సీతారామయ్య సీబీఎస్ఈ పాఠశాల విద్యార్థిని ప్రతిభ చూపినట్లు కరస్పాండెంట్ పాటిబండ్ల విష్ణువర్ధన్ తెలిపారు. లక్ష్మీపురంలోని పాఠశాలలో బుధవారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ 6వ తరగతి విద్యార్థిని ఎం. జగ్వీకృష్ణ సిలంబంలో బంగారు పతకాన్ని, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ నిర్వహించిన అండర్-17 బాస్కెట్ బాల్ పోటీల్లో 9వ తరగతి విద్యార్థిని ఏ. నిహారిక విన్నర్‌గా నిలిచినట్లు వివరించారు. చదువుతో పాటు విద్యార్థుల్ని క్రీడల్లో ప్రోత్సహిస్తూ జిల్లా నుంచి రాష్ట్ర, జాతీయస్థాయిల్లో ప్రతిభావంతులుగా తీర్చిదిద్దుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కమిటీ సభ్యుడు గింజుపల్లి వరప్రసాదరావు, డైరెక్టర్ లేళ్ల కృష్ణవేణి, ప్రిన్సిపాల్ జంపని పద్మజ, వైస్ ప్రిన్సిపాల్ తేజస్వి, ప్రైమరీ ప్రిన్సిపాల్ పార్వతీదేవి, సీనియర్ కో-ఆర్డినేటర్ దుర్గాశ్యామ్ పాల్గొన్నారు.

నసీర్ వ్యాఖ్యలతో కంగుతిన్న టీడీపీ నేతలు

- దళిత శంఖారావంలో నోరు జారిన నసీర్
- వాట్సాప్ గ్రూప్‌ల్లో హల్‌చల్

నగరంపాలెం: టీడీపీ తూర్పు ఇన్‌చార్జి నసీర్ అహ్మద్ వ్యాఖ్యలతో టీడీపీ నేతలు ఒక్కసారిగా కంగుతున్నారు. వివరాల్లోకి వెళ్తే.. అరండల్‌పేటలోని టీడీపీ ఉమ్మడి గుంటూరు కార్యాలయంలో బుధవారం రాష్ట్ర ఎస్సీ విభాగం ఆధ్వర్యంలో 'దళితులపై దమనకాండకు నిరసనగా దళితుల పంతం–వైసీపీ అంతం' అంటూ దళిత శంఖారావం పేరుతో సమావేశం నిర్వహించారు. పోలిట్ బ్యూరో సభ్యుడు నక్కా ఆనంద్‌బాబు, ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.ఎస్. రాజు, పార్టీ అధ్యక్షుడు తెనాలి శ్రావణ్‌కుమార్, జనసేన పార్లమెంటు అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు, తూర్పు ఇన్‌చార్జి నసీర్ అహ్మద్ తదితరులు వేదికపై ఆశీనులయ్యారు. నాయకులంతా మాట్లాడిన తర్వాత తూర్పు ఇన్‌చార్జి నసీర్‌కు మాట్లాడే అవకాశం వచ్చింది. ఈ క్రమంలో మైకు పట్టుకున్న ఆయన మాట్లాడుతూ 'ముఖ్యంగా చరిత్రలో ఎప్పుడు లేని విధంగా దళితుల మీద దళిత అట్రాసిటీ చట్టాన్ని ఉపయోగించినటువంటి చేతకాని దద్దమ్మ ఈ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుగారు అని, అమరావతి ప్రాంతంలో దళిత సోదరుల మీద ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు పెట్టి ఇబ్బందులు' పెట్టారనే వ్యాఖ్యలు చేయడంతో ఒక్కసారిగా వేదికపై ఆశీనులైన వారు కంగుతిన్నారు. ఇక నసీర్ వ్యాఖ్యలు వాట్సాప్ గ్రూప్‌ల్లో హల్‌చల్ చేస్తున్నాయి.

తూర్పులో మళ్లీ రగడ

తూర్పు నియోజకవర్గం రెండో డివిజన్ పరిధిలోని సీతానగర్‌లో బుధవారం సయ్యద్ ముజీబ్ వర్గం 'బాబుతో ష్యూరిటీ, భవిష్యత్ గ్యారంటీ' కార్యక్రమం నిర్వహించారు. ఈ క్రమంలో తూర్పు ఇన్‌చార్జి నసీర్‌కు సంబంధించి డివిజన్ నాయకులు ఆ కార్యక్రమాన్ని అడ్డుకున్నారు. దీంతో వారి మధ్య కాసేపు తోపులాట జరిగింది.

సాఫ్ట్‌వేర్ రంగంలో విస్తృత ఉపాధి అవకాశాలు



వినయ్‌కుమార్‌కు జ్ఞాపికను అందజేస్తున్న వీసీ

ఏఎన్‌యూ: సాఫ్ట్‌వేర్ రంగంలో విస్తృత ఉపాధి అవకాశాలున్నాయని సాఫ్ట్‌వేర్ టెక్నాలజీ ఆఫ్ ఇండియా జాయింట్ డైరెక్టర్, ఆఫీసర్ ఇన్‌చార్జి బి. వినయ్ కుమార్ తెలిపారు. సాఫ్ట్‌వేర్ టెక్నాలజీ ఆఫ్ ఇండియా సంస్థ ఆధ్వర్యంలో డాక్టర్ వైఎస్సార్ ఏఎన్‌యూ ఇంజినీరింగ్ కళాశాల సీఎస్ఈ విద్యార్థులకు లీప్ ఏ హెడ్ పేరుతో స్టార్టప్ అండ్ ఇంక్యుబేషన్ సంబంధిత అంశాలపై బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వినయ్ కుమార్ మాట్లాడుతూ సాఫ్ట్‌వేర్ రంగంలో ప్రస్తుతం స్టార్టప్, ఇంక్యుబేషన్లకు అధిక ప్రాధాన్యత లభిస్తోందన్నారు. విద్యార్థులంతా విద్యను అభ్యసిస్తున్న సమయంలోనే నూతన అంశాలపై అవగాహన పెంచుకోవాలని చెప్పారు. నూతన ఆలోచనలతో, కొత్త ప్రయోగాలపై దృష్టి సారించాలని సూచించారు. సాఫ్ట్‌వేర్ టెక్నాలజీ ఆఫ్ ఇండియా డెప్యూటీ డైరెక్టర్ డి. కిరణ్ కుమార్ విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. మారుతున్న కాలానికి అనుగుణంగా టెక్నాలజీని సద్వినియోగం చేసుకుంటూ దానిపై పట్టు సాధించాలని తెలిపారు. మిలట్రానిక్ కంపెనీ సీఈవో లోకేష్ తన స్టార్టప్ గురించి విద్యార్థులకు వివరించారు. అనంతరం వినయ్ కుమార్‌ను వీసీ ఆచార్య పి. రాజశేఖర్ అభినందించారు. విద్యార్థులకు అవసరమైన శిక్షణ తరగతులు నిర్వహించేందుకు సహకారం అందించాలని కోరారు. కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య పి. వరప్రసాదమూర్తి, రిజిస్ట్రార్ ఆచార్య బి. కరుణ, ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య పి. సిద్ధయ్య, డీన్ ఆచార్య ఈ. శ్రీనివాసరెడ్డి, అసిస్టెంట్ కో-ఆర్డినేటర్ డాక్టర్ ఎం.గోపీకృష్ణ, సీఎస్ఈ కో-ఆర్డినేటర్ డాక్టర్ బి. బాలాజీ, ప్లేస్‌మెంటు అండ్ డెవలప్‌మెంట్ సెల్ కో-ఆర్డినేటర్ డాక్టర్ తౌసిఫ్ అహ్మద్ పాల్గొన్నారు. ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం సర్వో మేధ సంస్థ క్యాంపస్ ప్లేస్‌మెంటును నిర్వహించిందని కో-ఆర్డినేటర్ డాక్టర్ తౌసీఫ్ అహ్మద్ తెలిపారు. ఈసీఈ, ట్రిపుల్‌ఈ, మెకానికల్ విద్యార్థులకు ఆన్‌లైన్ అసెస్‌మెంట్ ఎగ్జామ్ నిర్వహించినట్లు ఆయన చెప్పారు.

పర్ద్యూ యూనివర్సిటీ 'ఎపిక్స్'కి వీవీఐటీ ఎంపిక

పెదకాకాని: అమెరికాకు చెందిన ప్రతిష్టాత్మక పర్ద్యూ యూనివర్సిటీ ప్రారంభించిన ఎపిక్స్ కార్యక్రమానికి వీవీఐటీ కళాశాల ఎంపికైందని చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ తెలిపారు. మండలంలోని నంబూరు వాసిరెడ్డి వెంకటాద్రి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీని బుధవారం పర్ద్యూ యూనివర్సిటీ డైరెక్టర్, ప్రొఫెసర్ డాక్టర్ విలియమ్ వోక్స్ సందర్శించారు. విద్యార్థులు, అధ్యాపకులతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ మాట్లాడుతూ సాంకేతిక వినియోగం ద్వారా ప్రపంచ సవాళ్ల అధిగమించేలా విద్యార్థుల్లో నైపుణ్యాల్ని పెంపొందించడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని వివరించారు. దేశవ్యాప్తంగా 10 విద్యాలయాలు ఎంపిక కాగా వాటిలో వీవీఐటీ కళాశాల ఒకటి కావడం విశేషమన్నారు. ఎపిక్స్ కార్యక్రమాన్ని వీవీఐటీలో ప్రారంభిస్తున్నట్లు డాక్టర్ విలియమ్స్ వోక్స్ ప్రకటించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వై. మల్లికార్జునరావు, జాయింట్ సెక్రటరీ మామిళ్లపల్లి శ్రీకృష్ణ, అకడమిక్ డీన్ డాక్టర్ కె. గిరిబాబు పాల్గొన్నారు.

హెచ్‌సీ, ఏఎస్ఐలకు అవుట్‌డోర్ పరీక్షలు



నగరంపాలెం: గుంటూరు రేంజ్‌లోని 37 మంది హెచ్‌సీ, ఏఎస్ఐలకు బుధవారం పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌లో అవుట్‌డోర్ పరీక్షల్ని నిర్వహించారు. ఎస్ఐలుగా ఉద్యోగోన్నతి కల్పించేందుకు ఈనెల 28న అర్హత పరీక్షలను గుంటూరు రేంజ్ ఐజీ జి.పాలరాజు ఆదేశాల మేరకు నిర్వహించిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో బుధవారం కవాతు, మౌఖిక, ఆయుధాలకు సంబంధించి, నేరాలు జరిగిన ప్రదేశాలను పరిశీలించే పరీక్షలతో పాటు నైపుణ్య పరీక్షలు జరిగాయి. మంగళగిరి బెటాలియన్ కమాండెంట్ ఎస్‌వీఎస్ఎస్.సుబ్బారెడ్డి, ఒంగోలు పీటీసీ ప్రిన్సిపాల్ దామోదర్ పర్యవేక్షించారు.

చదువుల విప్లవానికి సీఎం జగన్ శ్రీకారం

పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్



నవరత్నాల ద్వారా చేకూర్చిన లబ్ధి వివరాల బోర్డును ఆవిష్కరించిన ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్

గుంటూరు ఎడ్యుకేషన్: రాష్ట్రంలో చదువుల విప్లవానికి శ్రీకారం చుట్టిన ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్ రెడ్డి ఇంజినీరింగ్ చదువులకు పూర్తిస్థాయిలో ఫీజుల్ని చెల్లించే విధానాన్ని అమల్లోకి తెచ్చారని పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్ చెప్పారు. బుధవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని పశ్చిమ నియోజకవర్గ పరిధిలో 25,36,38,39,45వ డివిజన్లలోని వివిధ ప్రాంతాల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా డివిజన్లలోని వార్డు సచివాలయాల్లో నవరత్నాల ద్వారా లబ్ధి చేకూర్చిన వివరాలతో ఏర్పాటు చేసిన డిస్‌ప్లే బోర్డులను ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం ఆయా ప్రాంతాల్లో గడప గడపకు వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుపై ప్రజాభిప్రాయ మద్దతు తీసుకున్నారు. ఆయన మాట్లాడుతూ దేశంలోని ఏ రాష్ట్రంలోనే లేని విధంగా సంక్షేమాభివృద్ధి కార్యక్రమాల్ని అమలు చేస్తున్న సీఎం జగన్‌మోహన్ రెడ్డి ఆంధ్రప్రదేశ్‌ను అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలిపేందుకు కృషి చేస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో 80 శాతంగా ఉన్న పేదలు ఆర్థికంగా ఎదగాలనే ఆశయంతో నవరత్నాల ద్వారా విస్తృత రీతిలో సంక్షేమ కార్యక్రమాల్ని చేపట్టారన్నారు. ప్రతి పైసా వారి సంక్షేమానికే వినియోగిస్తున్నారని చెప్పారు. ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వ పథకాల తీరును తెలుసుకునే కొత్త ఒరవడికి శ్రీకారం చుట్టిన సీఎం వై.ఎస్. జగన్‌మోహన్ రెడ్డి అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందించడమే ధ్యేయంగా అనుక్షణం తపన పడుతున్నారని వివరించారు. అన్ని వర్గాల ప్రజల కోసం వివిధ సంక్షేమ పథకాలు అమలు చేస్తూ, అన్ని సామాజిక వర్గాలకు న్యాయం చేస్తున్నారని తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో కార్పొరేటర్లు ఉడుముల లక్ష్మీ శ్రీనివాసరావు, షేక్ జుమ్మాబీ మార్కెట్‌బాబు, యక్కలూరి మారుతీ కోటి లింగారెడ్డి, షేక్ రోషన్, పడాల సుబ్బారెడ్డి, జేసీఎస్ క్లస్టర్ ఇన్‌చార్జులు నూనె ఉమామహేశ్వరరావు, ఏరువ ఇన్నారెడ్డి, ఉడతా కృష్ణా, మహమ్మద్ బాబూఖాన్, మహంకాళి బాలయ్య, ఎస్‌కే పండు, షేక్ షఫీ, మధు, షేక్‌బాజీ, ప్రభాకరరావు, సత్యనారాయణ, సంజీవరావు, స్కూల్ మస్తాన్‌వలీ, అరుణ్‌కుమార్, కె.శ్రీనివాస్, పిల్లుట్ల మోహన్‌రావు, వల్లి శ్రీనివాసరెడ్డి, కసి రాము, టి.శ్రీను, సీహెచ్.విజయ్, మస్తాన్‌వలీ, అంజీ నాయక్ , బి.సాంబశివారెడ్డి పాల్గొన్నారు.

డిసెంబర్ 19, 20 తేదీల్లో బాలోత్సవం



బాలోత్సవం బ్రోచర్ విడుదల చేస్తున్న డీఈఓ శైలజ, ఎమ్మెల్సీ లక్ష్మణరావు

గుంటూరు ఎడ్యుకేషన్: డిసెంబర్ 19, 20వ తేదీల్లో మంగళగిరి మండలం యర్రబాలెంలోని డాన్ బాస్కో హైస్కూల్లో జరగనున్న మంగళగిరి–తాడేపల్లి బాలోత్సవం (రెండో పిల్లల పండుగ) బ్రోచర్‌ను జిల్లా విద్యాశాఖాధికారి పి.శైలజ, ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు బుధవారం డీఈఓ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ లక్ష్మణరావు మాట్లాడుతూ మొత్తం 42 రకాల అకడమిక్, కల్చరల్ పోటీలు బాలోత్సవంలో నిర్వహిస్తున్నామని తెలిపారు. మంగళగిరి, తాడేపల్లి, దుగ్గిరాల, తుళ్లూరు, రాజధాని గ్రామాల్లోని పాఠశాలల విద్యార్థులు ఈ పండుగలో పాల్గొనాలని కోరారు. ఉరుకుల, పరుగుల జీవితంలో పిల్లల్లో ఉన్న సృజనాత్మకతను గుర్తించే తీరిక లేక ఇబ్బంది పడుతున్న పరిస్థితులు సమాజంలో నెలకొన్నాయని అన్నారు. బాలల్లో ప్రతిభా పాటవాలు, శక్తి, సామర్థ్యాలు పెరుగుతుండగా, సినిమాలు, సాంస్కృతిక రూపాలు సైతం సెల్‌ఫోన్లు, ఇంటర్నెట్, టీవీల ద్వారా పిల్లలకు అందుతున్న విషయాన్ని గుర్తు చేశారు. మరోవైపు ఆట పాటలు, వ్యాయామం శారీరక శ్రమ తగ్గిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఎంటీఎంసీ బాలోత్సవం గౌరవాధ్యక్షుడు నన్నపనేని నాగేశ్వరరావు, అధ్యక్షుడు వీవీ ప్రసాద్ మాట్లాడుతూ బాలోత్సవం విజయవంతానికి ఇప్పటికే 150 పాఠశాలలకు బ్రోచర్లు అందచేశామని చెప్పారు. రెండ్రోజులపాటు జరిగే ఈ పిల్లల పండుగకు సుమారు 4వేల మంది పిల్లలు హాజరవుతారన్నారు.ఉపాధ్యక్షుడు యడ్ల బాలకృష్ణ, కార్యదర్శి ప్రగడా రాజశేఖర్, పి.శ్రీలక్ష్మి, జె.శేషయ్య, కోశాధికారి గాదే సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని కారు మెకానిక్ మృతి

చేబ్రోలు: ప్రమాదవశాత్తూ ద్విచక్ర వాహనాన్ని ఆర్టీసీ బస్సు ఢీకొట్టడంతో కారు మెకానిక్ దుర్మరణం చెందిన సంఘటన చేబ్రోలు మండలం నారాకోడూరు వద్ద బుధవారం జరిగింది. పెదకాకాని ప్రాంతానికి చెందిన షేక్ కరీముల్లా(26) కారు మెకానిక్‌గా పని చేస్తున్నాడు. బుధవారం ఉదయం పొన్నూరు మండలం తొట్టెంపూడిలోని స్నేహితుడు రాజకుమార్ వద్దకు వెళ్లాడు. అక్కడ నుంచి స్నేహితుడు బుల్లెట్ మీద, మృతుడు కరీముల్లా స్కూటీ మీద పెదకాకాని బయలు దేరారు. మార్గంమధ్యలో నారాకోడూరు గ్రామ శివారులోని కారం మిల్లు ప్రాంతంలో ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. ఈ సంఘటనలో కరీముల్లా తలకు బలమైన గాయాలవ్వడంతో అక్కడక్కడే మరణించాడు. చేబ్రోలు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

కంటి సమస్యలకు బజరంగ్ రక్షణ కవచం



వెంకటకృష్ణాపురంలోని సిద్ధార్థ పబ్లిక్ స్కూల్ విద్యార్థులతో అంబటి మురళీకృష్ణ

పెదకాకాని: కంటి సమస్యల బారిన పడిన వారికి బజరంగ్ ఫౌండేషన్ రక్షణ కవచంలా పని చేస్తుందని ఫౌండేషన్ వ్యవస్థాపకులు అంబటి మురళీకృష్ణ అన్నారు. బజరంగ్ జగన్నామ సంక్షేమ సంవత్సరంలో భాగంగా పెదకాకాని మండలంలోని వెంకటకృష్ణాపురంలో బజరంగ్ ఫౌండేషన్ నేత్రజ్యోతి కార్యక్రమం ద్వారా ఉచిత కళ్లజోళ్ల పంపిణీని మురళీకృష్ణ ప్రారంభించారు. గత 11 నెలలుగా వేలాది మందికి 'నేత్రజ్యోతి' ద్వారా వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి కళ్లజోళ్లు పంపిణీ చేసినట్లు చెప్పారు. వెంకటకృష్ణాపురంలో వారం రోజుల కిందట శిబిరం నిర్వహించామన్నారు. ఇందులో వారి లోప ఆధారంగా 555 మందికి కళ్లజోళ్లు అందజేసినట్లు చెప్పారు. మహిళలు, వృద్ధులు, దివ్యాంగులు శిబిరం వద్దకు చేరుకునేందుకు ప్రత్యేకంగా వాహనం ఏర్పాటు చేశారు. స్థానిక సిద్ధార్థ పబ్లిక్ స్కూల్ వద్దకు వెళ్లి విద్యార్థులకు కళ్ళజోళ్లు అందజేశారు.

నేడు సుద్దపల్లిలో బజరంగ్ నేత్రజ్యోతి కళ్లజోళ్ల పంపిణీ

చేబ్రోలు: బజరంగ్ నేత్రజ్యోతిలో భాగంగా గురువారం మండలంలోని సుద్దపల్లిలో ఉచిత కళ్లజోళ్ల పంపిణీ చేయనున్నట్లు బజరంగ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు అంబటి మురళీకృష్ణ తెలిపారు. ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడారు. సుద్దపల్లిలో బజరంగ్ జగన్నామ సంక్షేమ సంవత్సరంలో భాగంగా నవంబర్ 26న నిర్వహించిన నేత్ర జ్యోతి శిబిరంలో 762 మందికి కంటి పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. కళ్లజోళ్లు అవసరమైన 689 మందికి సిద్ధం చేశామని చెప్పారు. సుద్దపల్లిలోని సాయిబాబా మందిరం దగ్గర గురువారం సాయంత్రం 3 నుంచి 5 గంటల వరకు మహిళలకు, 5 ఉంచి 7 గంటల వరకు పురుషులకు కళ్లజోళ్లను పంపిణీ చేస్తామని తెలిపారు.